


తెల్లవారుతూంది.

బండి దిగాడు బాపిరాజు. చలి వణికించింది. 'బండిలో కూర్చున్నంతసేపూ తెలియలేదుగాని చలి బాగా ఎక్కువే ఈ ఏడు' అనుకున్నాడు.

స్టేషన్ హాల్లోకి వచ్చాడు.

"ఏం మంచురా సామినాయుడూ! దీని దెబ్బకి మామిడిపూత ఎందుకయినా పనికొస్తుందంటావా?" అని ఎవరో ఎవర్నో అడుగుతున్నారు.

"అగ్గుందా, బాబూ?" అని చెయ్యి చాచాడు ఒక రైతు.

బాపిరాజు చుట్ట తీసి లైటరుతో వెలిగించుకుని ఆ లైటరుని రైతుకి ఇచ్చాడు.

శాలువా సరిగా కప్పుకుని చంకలో సంచి పెట్టుకుని లైటరు పుచ్చుకుని పక్కజేబులోకి జార్చి ఊరివైపు నడవసాగాడు బాపిరాజు.

తను నడుస్తున్నది తారురోడ్డు మీద అని తెలిసింది బాపిరాజుకి. 'అప్పుడిది కంకరరోడ్డే గదూ?' అని జ్ఞాపకం చేసుకోసాగాడు, ఇరవైఏళ్ళకిందట తను మసిలిన ఈ పరిసరాల్ని. 'అదైనా సీత కాపరానికి వచ్చేముందే కదూ వేశారు?' అనుకున్నాడు.

సీత బాపిరాజు భార్య. ఆ సంగతి అతనికి జ్ఞాపకం ఉంది. అంతేకాదు, తనకి ఒక కొడుకనీ, తను ఇల్లు వదిలి వచ్చేసేనాటికి సీత కడుపుతో ఉందనీకూడా బాపిరాజుకి గుర్తుంది.

ఈ ఇరవై సంవత్సరాలలోనూ ఇటు రాలేదు సరిగదా, తనెక్కడున్నదీ కుటుంబానికి తెలియనివ్వలేదు.

ఇల్లాలూ, ఇల్లూ, పిల్లల జ్ఞాపకాల్నీ, ఎప్పుడో గాని వాడని ఉన్నిరగ్గులాగ మడిచి, మనసు పెట్టె అడుగున పడేశాడు బాపిరాజు.

ఈ రెండు దశాబ్దాలలోనూ మనస్తాపాలూ, శరీరబాధలూ చలిగాలుల్లా తనని తినేటప్పుడు ఆ జ్ఞాపకాల ముసుగులోనే ఊరట పొందేవాడు.

ఎడమవైపు కాలవగట్టు; ఎదర రోడ్డు. కాలవ గట్టు ఊళ్ళోకి అడ్డదారి అని జ్ఞాపకం వచ్చి అటు మళ్ళాడు బాపిరాజు.

చుట్ట ఆరిపోయింది. లైటరు తీసి వెలిగించుకున్నాడు. ఈలోపున చలి ఆ ముసలాయన గుండెల్లో దూరి వణికించింది. 'ఈ వయస్సులో మరి ఇలాగా?' అని తనలో తనే నవ్వుకున్నాడు.

ఇప్పుడు వృద్ధాప్యం — అదేదో తన ముద్దుల మనవడైనట్టు — తనమీద స్వారీ చెయ్యడం తనకి సంతోషంగానే ఉందన్నట్టు అనిపిస్తోంది ఆ నవ్వు.

ఆశతో, ఆనందంతో ఉన్న వ్యక్తి తనకు చికాకు కలిగించే పరిస్థితులను ముద్దుగా అల్లరిచేసే పిల్లవాడిని చూసే తల్లి వైఖరితో సహిస్తాడు.

మంచుగుండా ఊళ్ళోని ఎలక్ట్రిక్ దీపాలు వెలుగు ముద్దల్లా కనబడుతున్నాయి. 'కరెంటు వచ్చిందన్న మాట. ఇంకా రాదూ?' అని తన జన్మభూమిలో వచ్చిన మార్పుల్ని చూడబోతున్నందుకు తృప్తిగా నవ్వుకున్నాడు బాపిరాజు.

వెలుగు విచ్చుకుంటూంది. ప్రకృతి అంతా [illegible] ట్రీట్‌మెంట్‌లో ఇమిడిన చిత్రంలా [illegible]

కనబడుతూంది, [illegible] కారుగా. [illegible] మెత్తి, కత్తిరింపుచిత్రాల్లా ఆ సని సురకలుగా కలిపేస్తున్నాయి. కొంచెం దూరాన్ని ఆ పొలానికి ఆ పెట్టేయి అంచుల్నిమాత్రం చూపించేస్తూ పచ్చటి బాళ్లు ఉన్నాయి.

కాలవకు అడ్డంగా గాలిలో వదుస్తున్నట్లు నడిచి అవతలిగట్టుకి చేరుకున్న మనిషి ఆకారం కనబడింది బాపిరాజుకి. చిన్నపిల్లాడులా నవ్వుకున్నాడు ఆ వింత చూసి.

'ఆఁ. అదుగో అక్కడే ఉండాలి వంతెన!' అనుకుంటూ ఉండగానే కనబడింది అనాటి కొబ్బరి బద్దల వంతెన కాంక్రీటుబ్రిడ్జిగా మారి.

ఆ వంతెనమీదుగా వెళ్లి నాలుగడుగులు ముందుకు వేస్తే ఎదురుగా తన ఇంటి పెరటిద్వారం వస్తుంది. మరి కాస్త ముందుకు వెళ్లి మలుపు తిరిగి వీధి గోకి వస్తే మేడమిద్దె అవతల తన ఇంటి సింహద్వారం!

ఆనందంతో బాపిరాజు అడుగులు తడబడుతున్నాయి.

తనవాళ్లను చూసుకోబోతున్నందుకు ఇంతగా ఆనందపడిపోయే బాపిరాజు ఇన్నేళ్లు వారిని చూడకుండా ఒక్క ఉత్తరమున్నాయినా రాయకుండా ఎలా ఉండగలిగాడు?

అతను ఎవరిమీదా కోపగించి వెళ్లిపోలేదు.

సంసారంమీద అతనికి ఆసక్తి లేదు; తల్లిదండ్రుల బలవంతంమీద పెళ్లాడాడు.

ధనసంపాదనమీద అతనికి వ్యామోహం లేదు; అవసరాలు తీరుతూంటే చాలు; ఆస్తుల్ని చూసుకోవడం అంటే చెడ్డ చికాకుగా ఉండేది.

సంసారం విషయంలో జంతువులా ఇష్టం వచ్చినట్టుగానూ, వ్యవహారం విషయంలో యంత్రంలా పరాకుగానూ ప్రవర్తిస్తూ కొన్నాళ్లు కాలం గడిపాడు.

అతనూ, అతనితోబాటు మిగతావాళ్లూ విసిగిపోయారు.

అదిగాక అతనికి చిన్నప్పటినించీ అటూ, ఇటూ పోయే అలవాటు ఒకటి ఉంది. స్థలం మార్పు తరుచుగా కావలసిన కొన్ని స్వభావాలలో అతని దొకటి. ఒక పిల్లవాడు పుట్టి భార్య మళ్లీ కనబోతూ ఉంటే కనబడకుండాపోయాడు బాపిరాజు.

బాధ్యతల్ని స్వీకరించలేని పిరికితనం, సోమరితనం, వాటినుంచి పలాయనం పొందడాన్ని మించిన ప్రయోజనంలేని తిరుగుబోతుతనం కలిసి బాపిరాజులోని మమతను జోకొట్టాయి.

తల్లి తన సౌకర్యంకోసం నిద్రరాని పిల్లవాణ్ని బోర్లా పడుకోబెట్టి జోకొడుతూంటుంది. కాని వాడు మధ్యమధ్య తల ఎత్తేసి చూస్తూ ఉంటాడు. ఆ తల నొక్కేసి కొంతసేపు జోకొట్టి వాణ్ని నిద్ర పుచ్చగలిగినా ఎప్పటికో అప్పటికి వాడు లేచి పోయి తల్లిచేత పిలిపించుకోక మానడు.

ఆ నిద్రరాని పసివాడివంటిది మనిషిలోని మమత.

ఈనాటి కది బాపిరాజులో మేల్కొని ఇంటికి లాక్కువచ్చింది.

'సీతనీ, పిల్లల్నీ చూసుకోవాలి. వాళ్లకి నా అండదండ లివ్వాలి. మొగదిక్కు లేక ఇన్నాళ్లూ ఎన్ని బాధలు పడ్డారో!' అనుకున్నాడాయన.

**నిద్దరాని పసివాడివంటిది మనిషిలోని మమత. ఎంతగా జోకొట్టి నిద్రపుచ్చినా నిద్రపోదు. బాధ్యతల్ని స్వీకరించలేని పిరికితనం, సోమరితనం మనిషిలోని మనసును కలుషితం చేస్తుంది. ఆ కాలుష్యం వదలించుకోడానికి ఏళ్లు పట వచ్చు. దశాబ్దాలు పట్టవచ్చు. ఆ దీర్ఘకాలంలో పొందే అలసట వృథా అయిపోయినట్లు కనిపించి, ఫలిస్తే కలిగే సంతోషం వర్ణనాతీతమే గదా!**

---

ఇంటిని సమీపించాడు. తన కాలంలో పెరటి గోడ ఇటుకలు కనిపిస్తూ నాచుపట్టి ఉండేది. ఇప్పుడు సిమెంట్ చెయ్యబడిఉంది. అప్పటిలా కాకుండా ఇప్పుడు దొడ్డి నిండా చెట్లు ఉన్నాయి.

ఓ కుర్రాడు గోడ ఎక్కి అరిటాకులు కోస్తున్నాడు.

"బాపిరాజుగారిల్లేనా, అబ్బాయీ, ఇది?" అని మాట కలపడానికి తోచిన ప్రశ్న వేశాడు.

ఆకు కోస్తున్న కుర్రాడు తల వెనక్కి తిప్పకుండానే "శంకర్రావుగారిదండీ" అని చెప్పాడు.

తన కొడుకు శంకరం ప్రయోజకుడై ఉంటాడనే ఆనందంతోబాటు ఇక్కడ తన పేరు విస్మరించబడింది గదా అన్న విచారం లీలగా కదిలింది బాపిరాజు మనస్సులో.

ఆ కుర్రాడు ఆకుల్ని కోసి, కత్తి బోదెకు గుచ్చి ఆకుల్ని జాగ్రత్తగా గోడమీద దొంతరగా పెడుతున్నాడు.

వాడు పనిలో లీనమైనట్టున్నాడు. వాడితో మాటలు కొనసాగించాలంటే ఇతర విషయాలు అడగడంకంటె ఆ పనికి సంబంధించిన భోగట్టా అడగడమే మంచిదని తోచింది బాపిరాజుకి.

"అరిటాకులు బాగా కోశావు. ఏమిటి కథ?"

"ఇయ్యాల సీతమ్మగోరి—" మాసికం అన్న మాట రాక బుర్ర గోక్కుని "ఆరు సోయి నెలయిందిగా. బొంయినాలు ఎట్టుకోవటం" అంటూ లోపలివైపు దూకాడు ఆ కుర్రాడు.

బోదెకు గుచ్చిన కత్తిని ఒక చెయ్యి, ఆకుల్ని ఒక చెయ్యి తీసుకున్నాయి.

రోడ్డమీద దీపాలు ఆరిపోయాయి.

బాపిరాజు నోట్లో చుట జారిపోయింది.

ఆకాశంవైపు చూశాడు — దేవుడికోసం కాబోలు.

నీలపు చంద్రవంక జాలిగా చూసింది అతనివైపు.

కాలవలో స్నానానికని వచ్చే స్త్రీల గొంతులు వినిపించి తల దించాడు బాపిరాజు.

అప్రయత్నంగా అతని కాళ్లు ముందుకు సాగాయి. వీధిలోకి వచ్చాడు.

తన ఇల్లుకూడా దాటాడు.

ఇన్నేళ్ల తరవాత సొంతఊరు వచ్చినందుకు అతను ప్రతీ అంగుళంలోని మార్పును ఆసక్తిగా పరిశీలిస్తూ ముందుకు సాగవలసింది, అసలు.

---

# రుద్రాభట్ల నరసింగరావు

---

కాని అతని మనసు గందరగోళంతో నిండిపోయి ఉంది.

కూరలూ, పాలూ, పెరుగూ అమ్ముకునేవాళ్ల కేకలతోటీ, రిక్షా సైకిళ్ల గంటల ధ్వనితోటీ, పందులూ, కుక్కల సందడితోటీ నిండిన ఆ వీధి ప్రశాంతంగా ఉంది, అతని మనసుతో పోల్చి చూస్తే.

'ఎరిగున్న వాళ్ళెవ్వరూ చూడ్డంలేదు కదా?' అనుకుంటూ కాఫీహోటల్లో దూరబడ్డాడు. బల్లమీద పందుంపుల్లలున్నాయి. ఒకటి తీసుకుని డబ్బా దొక్కుతో నీళ్లు తెచ్చుకుని మొహం కడుక్కున్నాడు. శాలువా మడతపెట్టి సంచిలో కుక్కి ఉత్తరీయంతో మొహం తుడుచుకున్నాడు.

ఓ మూల బల్లదగ్గర కూర్చున్నాడు. 'భార్య పోయిందని తెలిసి పది నిమిషాలు కాలేదు, అప్పుడే కాఫీ హోటల్లోకి వచ్చానని తెలిస్తే ఎవరైనా ఏమంటారు? మొహం ఉమ్మేస్తారు' అని సిగ్గుపడ్డాడు బాపిరాజు. 'కాని అలవాటు. పైగా ముసలివాణ్ణయిపోయాను' అని జాలితో సమాధానపడ్డాడు.

"వేడి ఇడ్లీ, పెసరట్, ఉప్మా, పూరీ. . ." అని చదివి నిలబడ్డాడు సర్వరు.

"రెండిడ్లెన్నూ, పెసరట్టూ, కాఫీ" అని ఒక్కమారే చెప్పేసి నిట్టూర్పు విడిచాడు.

భార్య మరణాన్నిగురించి చిత్రమైన ఆలోచన వచ్చింది బాపిరాజుకి. 'ఈనాడేమిటి? తనకి ఇరవై సంవత్సరాలనాడే లేదు భార్య! మరెందుకీ బాధ?' అని ప్రశ్నించుకున్నాడు. తను ఎంతో ఆశతో, కొండంత ఆశతో ఇంటికి వచ్చేసరికి ఈ లోకంనుంచి నిష్క్రమించి సీత తనను శిక్షించగలిగిందనీ, తనమీద కసి తీర్చుకోగలిగిందనీ అనిపిస్తూంది తనకి. ఇంకోరకంగా సీత చావుకు తానే కారకుడనీ అనిపిస్తూంది. బాధ, పశ్చాత్తాపం.

టిఫిన్ వచ్చింది.

తింటూంటే బాపిరాజుకి తనమీద తనకే అసహ్యం వేసింది. కాఫీహోటలుకి తను రావడం ఎవరైనా చూస్తే మొహం ఉమ్మేస్తారని కదూ అనుకున్నాడు. తను? లోకానికి జడవడమేనా, సీతపై తనకి అనురాగం లేదా? ఆమె చనిపోయిందన్న వార్త విన్నప్పటికే తిండి నోటికి వెళ్లేటంత నీచుడా తను?

ఆ ఆత్మనిందనుంచి ఒక నిశ్చయానికి వచ్చాడు బాపిరాజు.

తను ఇహ ఇంటికి వెళ్ళకూడదు!

ఇడ్లీలూ, పెసరట్టూ సగం సగం తిని వదిలేశాడు. కాఫీ తాగి డబ్బులిచ్చి, ఇవతలికి వచ్చేశాడు.

తన ఇష్టానికి వ్యతిరేకంగా ఒక నిర్ణయం తీసుకున్నవాడు తన ఇష్టానికి అనుకూలంగా ఏదో ఒకటి జరుగుతుందని తనకి తెలియకుండానే ఆశిస్తూంటాడు.

అలాగే బాపిరాజుకూడా ఇప్పుడు తన పిల్లల్ని చూసుకునేందుకు వీలుగా ఏదో జరక్కూడదా అని ఆశిస్తున్నాడు. 'చాలసేపు రోడ్డువార నిలుచున్నాడు, తనని ఎరిగున్న వాళ్లెవ్వరైనా పలకరిస్తారేమో' అనే ఆశతో. వాళ్లు తనని తన ఇంటికి లాక్కువెళ్లవచ్చు. ఊళ్లోకి తను వచ్చినట్టు ఇల్లాయనకి ఏ రీతిగానైనా తెలిస్తే బాగుండును.

కిళ్ళీకొట్టు ముందున్న బెంచీమీద చతికిలబడ్డాడు బాపిరాజు.

పొద్దెక్కుతున్నకొద్దీ రోడ్డుమీద జనసంచారం కూడా ఎక్కువ కాసాగింది. ఇరవై ఏళ్ళ కిందట ఈ రోడ్డుమీదే జనం పలచగా ఉండేవారు. పలకరించుకుంటూ తీరుబాటుగా కనబడేవారు. ఇప్పుడు పలకరింపులు తక్కువా, పరుగు లెక్కువా అయ్యాయి.

హైస్కూలు వదిలినట్టుంది. పెద్దపిల్లలు గుంపులు గుంపులుగా కేరటాల్లా ఒకవైపుకు సాగి పోతున్నారు. బాపిరాజు కూర్చున్న చోటుకు ఎదటి గోడల నిండా పాతిక మునుపటి సినిమాలకిసంబంధించిన పోస్టర్లయినా అంటించబడి ఉన్నాయి. కనీసం వారానికో సినిమా మారుతూఉంటుందని అర్థమైంది బాపిరాజుకి. ఓ కుర్రాడు చేతికందిన పోస్టరు చింపు తున్నాడు. పెడల్సుమీద నిలుచుని సైకిలు తొక్కు తూన్న మరో కుర్రాడు ముందువెళ్ళే అమ్మాయి జాకెట్‌మీద పెన్‌తో సిరా చల్లి వేగం పెంచాడు.

దృశ్యాలు విసుగెత్తగా తల దించేసుకుని చెవిన పడిన మాటలన్నీ వినసాగాడు బాపిరాజు.

"చదూ చెప్పిస్తార్టగానీ కట్నం అంతకంటె ఇవ్వ..."

"మొకన్నని భలేగా ఏడిపించావ్, గురూ."

"జెర్కిన్ పాకెట్టూ, గుర్రంబుర్రా ఇయ్యి."

"ఆ సీరియల్ బోరు కొట్టేస్తూంది, బ్రదర్."

"అమ్మాయిని ట్రెయినింగ్‌కి... పెళ్ళి మన తరవాత?"

"ఆరంజి..."

"అరిటికాయు పదమూడు పైసలు. ఇహ కొనలేం..."

"ఇదిగో డబ్బులు."

"మూడో క్లాసు. మా ఆవిడ కోతతీర్మానం ప్రవేశపెట్టింది."

"క్లాసంతా కలిసి విన్న డి. వి. ఆర్. వి ఎస్. వి. పేకాం."

ఇహ వినలేక పరధ్యానంలో పడ్డాడు బాపిరాజు.

అప్పట్లో ఊళ్ళోకి కొత్తమొహం వస్తే అతని ఆట్టు ముట్టు అనవాళ్ళన్నీ కనుక్కోందే వదిలేవారు కారు. ఇప్పుడా, తనవైపు చూసినవాడే లేడు. ముసలాళ్లని కొందరిని తను గుర్తించాడు. పలకరించే ధైర్యం లేక ఊరుకున్నాడు.

అప్పుడప్పుడు ఓ చిన్న కారు, మోటారుసైకిలు. అరగంటకో బస్సు.

పందుల మందడి.

ఒళ్ళు మండిపోయింది బాపిరాజుకి. తన ఆశ నెరవేరలేదన్న బాధలో అతనికి తన ఊరు సాధించిన అభివృద్ధిమీదే అసహ్యం వేసింది.

లేచాడు. ఆకలితో, నీరసంతో కళ్ళు తిరుగు తున్నాయి. వచ్చిన దారినే పట్టాడు.

మళ్ళీ తన ఇల్లు సమీపిస్తున్నాడు.

అప్పుడే వీధిలోకి ఎంగిలాకులు పారెయ్యడానికి వచ్చింది ఒక యువతి.

తన కళ్లని తాను నమ్మలేక పెద్దవి చేసుకుని చూశాడు. 'సీత!' అని గొణుక్కున్నాడు. 'అదుగో, పచ్చంగా పొట్టిగా ఉంది. అదే కోలమొహం, నొక్కుల జుట్టు, పొట్టి జడ!'

"సీతా!" అని కేకేశాడు.

ఆ అమ్మాయి వింతగా చూసింది అతనివైపు. 'అవే నల్లని పెద్దకళ్ళు.'

"సీతా!" అని మరింత గట్టిగా పిలిచాడు.

పిచ్చివాడనుకుందేమో ఆకుల్ని గబుక్కున పారేసి లోపలికి పరిగెట్టింది ఆ అమ్మాయి.

శంకరం ఆమెకి ఎదురుగా వచ్చాడు.

బాపిరాజు పరిగెత్తబోయి పంచె కాళ్లకు అడ్డ పడగా ముందుకి తూలిపోయి కాసుకుని మెట్లమీద చతికిలబడ్డాడు.

"చూడన్నయ్యా" అని లోనికి పోయిందా అమ్మాయి.

ఇదంతా క్షణాలమీద జరిగింది.

శంకరం ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

బాపిరాజు చేతిలోని సంచి మెట్లమీద పడి పోయింది. అందులోని గుడ్డలు ఇవతలికి వచ్చేశాయి.

ఆ దృశ్యం శంకరాన్ని కదిలించివేసింది.

గబగబా ముందుకు వెళ్ళి ఆయన్ని లేవనెత్తాడు. ఉలెన్ పింటింగ్, సిల్కు షర్టింగ్, పట్టుచీరా చూసి 'పాపం, ఎవరికి ఇచ్చుకుందామని తీసుకెళుతున్నాడో ఈయన' అనుకుంటూ, "లోపలికి రండి. ఫరవాలేదు. వాటిని నౌకరు కుర్రాడు తీసుకువస్తాడు. వెంకన్నా..." అని కేకేశాడు.

ఆ పాతికేళ్ల కుర్రాణ్ణి తన కొడుకుగా గుర్తు పట్టాడు బాపిరాజు. తన కొడుకు తనని లేవనెత్తి అంత దయగా లోపలికి తీసుకువెళుతూఉంటే ఇహ దుఃఖం ఆపుకోలేకపోయాడు బాపిరాజు. అప్రయత్నంగా అతని కళ్లవెంట కన్నీళ్ళు ధార కట్టాయి.

ఆయన్ని నెమ్మదిగా ఒక కుర్చీమీద కూర్చో బెట్టాడు శంకరం.

"ఏం బాబుగారూ, ఎక్కడా దెబ్బ తగల్లేదు కదా?"

కన్నీరు మరింతగా కాలవ కట్టింది బాపిరాజుకి. తన ఈ బలహీనతకి ఓ పక్కనించి చాలా సిగ్గుపడి పోతున్నాడు బాపిరాజు. కాని తను స్వయంగా కొడుకును కోరలేనిదాన్ని—తను ఆ ఇంట ఒక్క పూటయినా ఉండి తన పిల్లల్ని చూసుకోవాలని తపిస్తున్నానేదాన్ని—ఈ కన్నీళ్ళు అతనికి చెప్పక చెప్పి తను అక్కడ ఆగడానికి కారణం కాగలవనే ఆశ ఓ పక్క కదిలింది బాపిరాజు మనసులో.

ఆయన స్థిమితపడడానికి అవకాశం ఇస్తూ లోపలికి వెళ్లాడు శంకరం.

"ఆయనకికూడా వడ్డించమను, లక్ష్మీ."


"ఇంతకీ ఎవరన్నయ్యా ఆయన?" అని అడి గింది, బాపిరాజు 'సీత' అని భ్రమపడిన అమ్మాయి.

"ఎవరైతేనేం, బ్రాహ్మణులు. నుదుట గంధం, బొట్టూ లేవు. మొహంలో భోంచేసిన కళ లేదు. ఏదో బాధ రేగిన మనిషిలా ఉన్నాడు. నెమ్మదిగా అన్నీ తెలుస్తాయి" అని చెప్పి హాల్లోకి వచ్చి, "బాబుగారూ! లేచి కాళ్ళు కడుక్కోండి" అని బాపిరాజుకి చెంబుతో నీళ్లందించాడు శంకరం.

* * *

తన తల్లిదండ్రులతో ఆ వచ్చిన ఆయనకి స్నేహం ఉండిఉంటుందని ఊహించాడు శంకరం. అయితే అప్పుడాయన్ని ఏమీ అడగడం బాగుండదని ఊరు కుని, తన తల్లి కబుర్లు ఏవో చెప్పసాగాడు. ఆయన ఆసక్తిగా వినడం చూసి మరింత ఉత్సాహంతో ఆవిణ్ణి గురించి చెప్పాడు శంకరం.

కొడుకు ఆదరణ చూడగానే నేను ఫలానా అని చెప్పి ఆ ఇంట్లో ఉండిపోవాలనిపించింది బాపిరాజుకి. కాఫీహోటల్లో చేసుకున్న నిర్ణయాన్ని తోసిరాజనాలను కున్నాడు. కాని శంకరం మాటల్లో అతనికి తల్లిపట్ల



ఎంతో ప్రేమా, గౌరవమూ ఉన్నట్లు వెల్లడి కాగానే కొంచెం జంకాడు బాపిరాజు. తల్లిమీద అంత అపేక్ష ఉన్న కొడుకు ఆవిడ కష్టాలకు కారణమైనవాణ్ని—అతను తన తండ్రే కానీ—క్షమిస్తాడా అన్నది బాపిరాజు సంశయం. క్షమించడని అతని ఊహ. ఈ అపోహమీద ఆధారపడే బాపిరాజు శంకరం మాటల్ని అర్థం చేసుకున్నాడు. ఉదాహరణకి: "మా అమ్మ చాలా మంచిది" అని శంకరం అన్నప్పుడు 'మా నాన్న [illegible] దుర్మార్గుడు' అని బాపిరాజు అర్థం చేసుకున్నాడు.

శంకరంమట్టుకు ఏ పాపం ఎరగడు.

తను తండ్రినని తెలిస్తే తన పిల్లలు తనని అసహ్యించుకుంటారని ఊహించుకున్నాక, వాళ్లకి ఆ సంగతి తెలీకుండానే తను అక్కణ్నించి వెళ్ళిపోవడం ఉత్తమం అనుకున్నాడు బాపిరాజు. అంతకు ముందు జరిగిన సంఘటనకు సంజాయిషీగా చిన్న కథ అల్లక తప్పలేదు. తను శంకరం తండ్రికి మిత్రుడినని, ఇరవై ఏళ్ల కిందట తను వాళ్ళ ఇంటికి వచ్చినప్పుడు శంకరం తల్లి సీత తనని ఎంతో ఆదరించిందని చెప్పాడు. అనాటి సీత రూపే తనకి గుర్తు. లక్ష్మి అచ్చు తల్లిపోలిక. ఆమెని చూడగానే సీత అనే భ్రమపడ్డాడు తను. ఇరవై ఏళ్ల తరవాత సీత ఇంకా అలాగే ఉంటుందా అనే ప్రశ్న ఆ క్షణంలో తనకి కలగలేదు.


అయిన తన తల్లిపట్ల చూపే సానుభూతిలో మునిగి తేలుతున్నాడు శంకరం. లేకపోతే ఆ కథ ఎంతవరకూ సంభవం అని ఆలోచించి ఉండునేమో.

ఉత్సాహంగా తల్లి జీవితచరిత్ర అంతా చెప్పాడు శంకరం

"పతి గల వైధవ్యం" అనే మాట ఉంటే అది తన తల్లి పరిస్థితికి సరియైన మాట. అది వైధవ్యం కంటే ఘోరమైనది. పేరంటాలకి పిలవడం మానరు. పిలిచిన తరవాత వెళితే గుసగుసలు. వెళ్ళక పోతే అలిగియుం అని దెప్పిపొడుపులు. కార్యంకథా వచ్చి కొంత ఆస్తి అమ్మేస్తే ఆడపెత్తనం అని ఈసడింపులు. కొంతే ఈర్ష్య. కష్టంలో ఉన్న ఆడపిల్ల ఆస్తిని కలుపుకునేదాకా అన్నం సయించని అన్నదమ్ములు. ఏ మూలనించీ సానుభూతిలేని జీవితాన్ని నిబ్బరంగా గడుపుతూ, పిల్లల్ని పైకి తీసుకువచ్చింది ఆవిడ. తనని చదివించింది. చెల్లెలుకి మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. ఆమెకు ఓ మొగపిల్లవాడు. తన పెళ్లిప్రయత్నంకూడా చేస్తూనే హఠాత్తుగా మరణించింది.

బాపిరాజుకు ఇల్లంతా చూపించాడు శంకరం. లక్ష్మి తన కొడుకుని అందించింది. పనసపండులా ఉన్నాడు కుర్రాడు. కొన్ని గంటల్లోనే బాపిరాజును తమ ఇంట్లో మనిషిలా చేసేసుకున్నారు ఆ అన్నా చెల్లెళ్ళు. ఆ రాత్రి వాళ్ళ బలవంతంమీద ఆగిపోయాడు. తెల్లవారుఝామున రైలుకి వెళ్ళాలి.

ఆ రాత్రి అంతా పడుకున్నాకకూడా బాపిరాజుకి నిద్ర రాలేదు. హాల్లో కిటికీదగ్గరగా అతని మంచం. వీధిలోని ఎలక్ట్రిక్‌దీపం వెలుగు కిటికీగుండా అతని పక్కమీద పడుతూంది. ఆ దీపం చుట్టూ దోమలు; అతని మనసులో ఆలోచనలు. నల్లులు కుడుతూంటే




వీధిదీపం వెలుగులో వాటిని వెతికాడు. ఒకటీ అరా తప్ప మిగతావి కనబడలేదు. 'కనబడకుండా కుడుతున్నాయి వెధవ నల్లులు' అని విసుక్కున్నాడు. నిజానికి ఆ విసుగు—అస్పష్టంగా తన మనసులో మెదులుతూ తనని బాధపెడుతున్న ఆలోచనలవల్ల.

బాపిరాజు లేచి వెళ్లి కొడుకు గదిలోనికి తొంగి చూశాడు. గోడవైపు ఒత్తిగిలి పుస్తకంలా పడుకున్నాడు శంకరం. అక్కణ్నించి ఎదురుగా ఉన్న కూతురి గదిదగ్గరకి వెళ్ళాడు. కిటికీ ఊచలకు తల ఆన్చి లోనికి చూశాడు. బాబు బోర్లా పడుకున్నాడు. లక్ష్మి ఓ చెయ్యి తలకింద పెట్టుకునీ, ఓ చేత్తో వాణ్ణి పొదువుకునీ పడుకునిఉంది.

అలా ఎంతసేపు ఉండిపోయాడో!

అతని పరధ్యానాన్ని పటాపంచలుచేస్తూ గడియారం గంటలు కొట్టసాగింది. పన్నెండు విన్నాడు.

మంచందగ్గిరికి వచ్చాడు.

నానారకాల పద్దులూ రాసుకునే పుస్తకం ఒకటి ఉంది అతని సంచీలో.

దాన్ని బయటికి తీసి, ఓ కాగితం చింపి ఇలా రాశాడు:

"చిరంజీవులైన పిల్లలకు ఆశీర్వచనాలు. నే నిక్కడికి వస్తూ అనుకున్న దొకటి: మీ అమ్మకీ, మీకూ చేదోడు వాదోడుగా ఉంటూ నా జీవిత శేషాన్ని గడుపుదామని. తీరా వచ్చాక ఇక్కడ చూసిన దింకొకటి — నా తోడ్పాటు తన కవసరంలేదని చెప్పడానికో అన్నట్టు మీ అమ్మ స్వర్గస్థురాలైంది. మిమ్మల్ని ప్రయోజకుల్ని చేసి మీకూ నా ఆసరా అవసరం లేకుండా చేసింది. అయినా ఈ వృద్ధాప్యంలో నేను మీ కేదో తోడ్పడగలననుకోవడం ఆత్మవంచన కాకుంటే, హాస్యాస్పదంగా తోచింది ఇప్పుడు. సుఖంగా ఇంటి పట్టున కాలక్షేపం చేద్దామనే ఆశతోనే నేనిలా వచ్చానని గ్రహించుకున్నాను. అది పేరాశ. అందుకు నాకు యోగ్యత లేదు.

అంచేత వచ్చిన దారినే వెళ్లిపోతున్నాను. నా ఇంటి నుంచి నన్ను నేనే గెంటుకుంటున్నాను.

నిత్యం మీ సుఖం కోరే, మీ తండ్రి, బాపిరాజు."

ఇది రాస్తున్నప్పుడు బాపిరాజు మొహంలో బాధల నీడలు కదిలాయి. కొన్ని వాక్యాలు ఎవరో నిర్బంధంగా తనచేత రాయిస్తున్నట్టు ఆగి ఆగి రాశాడు. ఉత్తరం చదువుకున్నాక "నా ఇంటినుంచి నన్ను నేనే గెంటుకుంటున్నా"ననే వాక్యం పిల్లల మనసులకి నొప్పి కలిగిస్తుందని తోచి దానిని శుభ్రంగా కొట్టేశాడు.

ఆ ఉత్తరాన్ని కొత్తగుడ్డలమధ్య పెట్టి వాటిని మంచంమీద ఉంచి తన సంచీ తీసుకున్నాడు. శాలువా కప్పుకోక భుజంమీద కండువాలా వేసుకున్నాడు.

ఆఖరుసారిగా కొడుకునీ, కూతుర్నీ చూసుకుని గబగబా నడిచి పెరటిదారంట కాలవగట్టుమీదకి వచ్చాడు. అతని వేగం అంతవరకే. అక్కడ ఆగిపోయాడు —విభిన్న దిశలనుంచి సమాన బలంతో ఆకర్షించే అయస్కాంతాలమధ్య ఎటూ కదలక నిలిచిపోయిన సూదిలా.

ఆఖరికి నెమ్మదిగా కదిలాడు. అతి భారంగా పడసాగాయి అతని అడుగులు.

మంచు బాగా కురుస్తూంది—గతదినంలాగే.

ఊహకూడా మంచులాటిదే. వాస్తవాన్ని రకరకాలుగా మార్చి, కప్పి కనబరుస్తుంది. సమయం వచ్చినపుడు మంచులాగే విడిపోతుంది ఊహ.

స్టేషన్ చేరుకున్నాడు బాపిరాజు. బెంచీలన్నీ పడుకున్నవాళ్లతో నిండిఉన్నాయి. అవి చాలక చాలా మంది నేలమీద ముసుగుతన్నీ, కప్పుకునేందుకు ఏదీ లేక ముడుచుకునో పడుకొన్నారు. ఓ ఇల్లంటూ లేని జనం కొంతమంది. అందులో, ఆ సమయాన బాపిరాజు దృష్టిలో పడ్డది వాళ్ళే. అతనుకూడా వాళ్ళ మధ్య ఓ తువ్వాలు పరుచుకుని పంచీ [illegible]

(తరువాయి 62 వ పేజీలో)